సాక్షి
రంగారెడ్డి
గురువారం । 20 । ఏప్రిల్ । 2023



పశుబీమాకు మంగళం?
ప్రకృతి వైపరీత్యాలు, ప్రమాదాలు జరిగినప్పుడు ఏటా వందలాది పశువులు మృతి చెందుతున్నా బాధితులకు బీమా అందడం లేదు. 8లో▸



బలోపేతానికి శ్రమించాలి
కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతీ కార్యకర్త శక్తివంచన లేకుండా కృషిచేయాలని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అన్నారు. 8లో▸



ఘన స్వాగతం
పద్మభూషణ్ అవార్డు గ్రహీత శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ చిన జీయర్ స్వామికి భక్తులు ఘనస్వాగతం పలికారు. 8లో▸



పాలకూట విషం!

కాదేదీ కల్తీకి అనర్హం అనేలా మారింది ప్రస్తుత పరిస్థితి. మార్కెట్లో లభించే ఏ వస్తువు అసలైనదో.. ఏది నకిలీదో గుర్తించడం వినియోగదారుడికి పెద్ద టాస్క్‌లా తయారైంది. అక్రమార్జనకు అలవాటుపడిన కొంతమంది.. పసి పిల్లలు తాగే పాలను సైతం వదలడం లేదు. ప్రమాదకరమైన రసాయనాలను కలిపి పాలను.. స్లో పాయిజన్‌లా మారుస్తున్నారు.

- యథేచ్ఛగా.. పాలు, పాడి ఉత్పత్తుల కల్తీ
- డిమాండ్ నేపథ్యంలో వెలుగు చూస్తున్న అక్రమాలు
- ప్రముఖ డెయిరీల నుంచి శాంపిల్స్ సేకరణ
- నాణ్యత లేమి, రసాయనాల గుర్తింపు
- నోటీసులు జారీ చేసిన అధికారులు



సాక్షి, రంగారెడ్డి జిల్లా: ఎండలు భగ్గున మండుతున్నాయి.. పశువులకు పచ్చిమేత కరువైంది. ఫలితంగా పాల దిగుబడి తగ్గిపోయింది. ప్రస్తుతం మార్కెట్లో పాలు, పెరుగు, మజ్జిగ పాల పదార్థాలతో తయారు చేసిన ఐస్‌క్రీంలకు మంచి గిరాకీ ఉంది. సరఫరా.. డిమాండ్ మధ్య భారీ వ్యత్యాసం ఉండటంతో కొంత మంది డెయిరీ వ్యాపారులు అధిక సంపాదన కోసం అడ్డదారులు తొక్కుతున్నారు. ప్రజారోగ్యాన్ని పణంగా పెడుతూ పాలను కల్తీ చేస్తున్నారు. కొంత మంది పరిమితికి మించి కుళాయి నీళ్లు కలుపుతుండగా .. మరికొంత మంది ఏకంగా కృత్రిమ పాలను తయారు చేసి మార్కెట్‌కు తరలిస్తున్నారు. జిల్లా ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారులు ఇటీవల జిల్లాలోని చేవెళ్ల, నందిగామ, ఆల్మాస్‌గూడ, నాదర్‌గు ముచ్చింతల్, పసుమాములలోని పలు ప్రైవేటు డెయిరీల నుంచి నమూనాలు సేకరించి, పరిశీలించగా విస్తుగొలిపే అంశాలు వెలుగు చూశాయి. వీరు సరఫరా చేసే పాలు, పాల ఉత్పత్తులు నాసిరకంగా, ఆరోగ్యానికి ప్రమాదకరమైనవిగా ఉన్నట్లు తేలింది. దీంతో ఆయా డెయిరీల యాజమాన్యాలకు నోటీసులు జారీ చేశారు.

ఆక్సిటోసిన్ ఇంజక్షన్లు

గ్రేటర్ జిల్లాలకు నిత్యం సగటున 28 లక్షల లీటర్ల పాలు అవసరం. ఇందులో 22 లక్షల లీటర్లు పాల పాకెట్ల రూపంలో సరఫరా అవుతున్నాయి. డెయిరీ రైతులు, డబ్బా వాలాలు, ఇతర వ్యాపారులు నేరుగా మరో ఆరు లక్షల లీటర్లు విక్రయిస్తున్నారు. వీటిలో 12కిపైగా ప్రముఖ డెయిరీలు సుమారు 20 లక్షల లీటర్ల పాలను అమ్ముతున్నాయి. ఒకప్పుడు మెజార్టీ పాలు శివారు జిల్లాల్లోని వ్యక్తిగత డెయిరీల నుంచే సరఫరా అవుతుండేవి. ప్రస్తుతం రైతుల భూములన్నీ రియల్ ఎస్టేట్ వ్యాపారుల చేతుల్లోకి వెళ్లిపోయాయి. డెయిరీల నిర్వహణ భారంగా మారింది. కూలీలు, పశువుల మేత, దాణా ఖర్చులు రెట్టింపయ్యాయి. దీంతో చాలా మంది రైతులు డెయిరీలు తీసేశారు. దీంతో మహారాష్ట్ర, కర్ణాటక, ఏపీ సరిహద్దు జిల్లాల నుంచి నగరానికి పాలను దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. ప్రస్తుతం మార్కెట్లో నాణ్యమైన పాలకు డిమాండ్ ఎక్కువగా ఉంది. ఇదే అదనుగా తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే దురాశతో.. ఎక్కువ పాల దిగుబడి కోసం కొంతమంది వ్యాపారులు తమ గేదెలు, ఆవులకు ఆక్సిటోసిన్ ఇంజక్షన్లు ఇస్తున్నారు. ప్రమాదకరమైన 'బీర్‌దాణా'ను తాగిస్తున్నారు. ప్రత్యక్షంగా పశువుల ఆయుఃప్రమాణాన్ని తగ్గించడంతో పాటు పరోక్షంగా పాలను తాగిన చిన్నారులు అనారోగ్యానికి కారణమవుతున్నారు.

నీళ్లు.. పామాయిల్

సహజంగా గేదె, ఆవు పాలల్లో ఐదు నుంచి ఏడు శాతం వెన్న ఉంటుంది. వీటికి ఆయా డెయిరీలు రైతులకు లీటరుకు రూ.35 నుంచి రూ.40 వరకు చెల్లిస్తుంటాయి. డెయిరీలు చెల్లించే ధరలు పశుపోషకులకు గిట్టుబాటు కావడం లేదు. దీంతో కొంత మంది స్వయం ఉపాధి కోసం ఉదయం, సాయంత్రం వేళల్లో డబ్బా వాలా అవతారం ఎత్తారు. డెయిరీలు సరఫరా చేసే ప్యాకేజ్డ్ పాలతో పోలిస్తే వ్యక్తిగత డెయిరీల నిర్వాహకులు సరఫరా చేసే స్వచ్ఛమైన పాలలో వెన్నశాతం అధికంగా ఉంటుంది. దీంతో ఎక్కువ మంది ఈ పాలను వాడేందుకు ఆసక్తి చూపుతారు. ప్యాక్‌డ్ పాల ధరతో పోలిస్తే వీరు సరఫరా చేసే పాల ధరే ఎక్కువ. పిల్లలకు స్వచ్ఛమైన గేదె, ఆవు పాలు పట్టించాలనే ఉద్దేశంతో చాలా మంది ధరలను పరిగణనలోకి తీసుకోకుండా వీరిని ఆశ్రయిస్తున్నారు. ఈ బలహీనతను పలువురు వ్యాపారులు తమకు అనుకూలంగా మలుచుకుంటున్నారు.

కల్తీ ఇలా..

పాలలో వెన్నశాతాన్ని పెంచేందుకు కొంతమంది వక్ర మార్గాలను అనుసరిస్తున్నారు. రెండు లీటర్ల పాలను తీసుకుని ఇందులో కొంత యూరియా, పామాయిల్ కలుపుతున్నారు. ఇలా తయారు చేసిన కృత్రిమ పాలలో ఈకొలి, కోలిఫాం వంటి ప్రమాదకరమైన బ్యాక్టీరియా ఆనవాళ్లు వెలుగు చూస్తున్నాయి. ఇవి నశించాలంటే పాలను వంద డిగ్రీల సెల్సియస్ వరకు మరగబెట్టాలి. మామూలుగా వేడి చేసి తాగితే అనేక అనారోగ్య సమస్యలు ఎదురయ్యే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు చెబుతున్నారు.

స్వచ్ఛతను గుర్తిద్దాం ఇలా..

- స్వచ్ఛమైన పాలు 0.55 డిగ్రీల సెంటీగ్రేడ్‌ల వద్ద గడ్డకడతాయి. ఈ ఉష్ణోగ్రత మారిందంటే అందులో నీరు కలిసిందని అర్థం.
- లాక్టోమీటరు పరికరంలో పాలు పోయగానే అందులో కొవ్వు కాకుండా ఇతర ఘన పదార్థాలు (ఎస్ఎన్ఎఫ్) ఎంత శాతం ఉన్నాయో తెలిసిపోతుంది.
- పాలను వేడి చేసినప్పుడు వచ్చే ఆవిరితో ఏర్పడే ఘనపు రేణువులు స్ఫటికాల రూపంలో ఘనీభవిస్తే అందులో యూరియా కల్తీ చేసినట్లు భావించవచ్చు.
- స్వచ్ఛమైన పాలను బండపైపోస్తే అవి ప్రవహించినంత దూరం తెల్లటి ధారలా కనిపిస్తుంది. అరచేతిని వెనుక వైపు తిప్పి.. మరో చేత్తో కొన్ని చుక్కల పాలను దానిపై పోస్తే నాణ్యమైన పాలైతే సన్నటి ధారలా ప్రవహిస్తుంది. అదే నీళ్లు కలిస్తే ధార ఏర్పడకుండా చివర్లో తెల్లటి చుక్కలా నిలిచి పోతుంది.
- వేడి చేసినప్పుడు పాలపై పసుపు పచ్చగా మీగడ రూపంలో పేరుకుపోవడం, తోడు వేసినప్పటికీ పెరుగు కాకపోవడం, వంటి లక్షణాలు కనిపిస్తే ఆ పాలలో వనస్పతి ఆయిల్ కలిసినట్లు..
- పాలు ఎక్కువ రోజులు నిల్వ ఉండేందుకు హైడ్రోజన్ పెరాక్సైడ్ కలుపుతున్నారు. వీటిని కాగబెట్టి తోడు వేసిన తర్వాత పెరుగుగా మారకపోగా నీళ్ల రూపంలో కనిపిస్తుంది.

పదేళ్లకే.. నూరేళ్లు



ఆస్పత్రి బెడ్‌పై విగతజీవిగా సంతోష్

పది నిమిషాల్లో ఇల్లు చేరాల్సిన పదేళ్ల పసిబాలుడిని మృత్యువు కబళించింది. చిట్టి చేతులతో బైబై చెప్పి.. నవ్వుతూ బడికి వెళ్లిన తమ బిడ్డను.. విగతజీవిగా చూసిన తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. శంకర్‌పల్లి శివారులో బుధవారం మధ్యాహ్నం జరిగిన ఈ దుర్ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి..

- ఆటో బోల్తా పడి బాలుడి మృతి
- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు
- ప్రమాద సమయంలో వాహనంలో 19 మంది

శంకర్‌పల్లి: సింగాపురం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ పటాన్‌చెరు మండలం భానూరు శివారులోని బీడీఎల్ డీఏవీ పబ్లిక్ స్కూల్ నుంచి రోజుమాదిరిగానే మధ్యాహ్నం 12:40 గంటల ప్రాంతంలో విద్యార్థులను శంకర్‌పల్లికి తీసుకెళ్తున్నాడు. శంకర్‌పల్లి శివారులోకి రాగానే ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. చిన్నారుల అరుపులు, కేకలు విన్న బుల్కాపురం రియల్ వ్యాపారి భానూరి కృష్ణ ఘటనాస్థలికి చేరుకున్నారు. డ్రైవర్ సాయంతో ఆటోను పైకిలేపి అందులో ఇరుక్కున్న చిన్నారులను బయటకు తీసి.. తీవ్రంగా గాయపడిన ముగ్గురిని తన వాహనంలో స్థానిక లలితా ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుల్లో ఐదో తరగతి బాలుడు సినో సంతోష్(10) పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం నగరానికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి తండ్రి సంతోష్ కేరళవాసి. ఈయన రెండేళ్ల క్రితం ఆర్మీ ఉద్యోగిగా రిటైరయ్యారు. తల్లి బినా సంతోష్ శంకర్‌పల్లి స్వరాజ్ ఆస్పత్రిలో పనిచేస్తోంది. పది నిమిషాల్లో ఇంటికి వస్తాడనుకున్న కుమారుడు విగతజీవిగా మారడంతో తల్లిదండ్రులు దుఃఖసాగరంలో మునిగిపోయారు. మరో ఇద్దరు విద్యార్థులను ప్రథమ చికిత్స అనంతరం నగరంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన సమయంలో వాహనంలో 19మంది ప్రయాణిస్తున్నారు. పరిమితికి మించి పిల్లలను ఎక్కించడంతోనే ఇలా జరిగిందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తంచేశారు. ఈ మేరకు ఆటో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ ప్రసన్నకుమార్ తెలిపారు.

మహిళలపై వివక్ష తగదు



సదస్సులో ప్రసంగిస్తున్న సునీతారెడ్డి

- మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి
- కలెక్టరేట్‌లో మహిళా సాధికారిత సదస్సు
- హక్కులపై అవగాహన పెంచుకోవాలని పిలుపు

ఇబ్రహీంపట్నం రూరల్: మహిళలపై కొనసాగుతున్న వివక్షను రూపుమాపేందుకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి అన్నారు. మహిళా సాధికారిత, మహిళలపై జరుగుతున్న దాడులపై బుధవారం కలెక్టరేట్‌లో సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళల సమస్యల పరిష్కారానికి కమిషన్ ఎంతగానో కృషిచేస్తోందని తెలిపారు. మహిళల హక్కులకు భంగం కలిగినప్పుడు బాధితులకు తగిన న్యాయం చేస్తూ వారికి అండగా నిలుస్తున్నామని స్పష్టంచేశారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను సద్వినియోగం చేసుకుంటున్న బాలికలు, యువతులు, మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా రాణిస్తున్నారన్నారు. అయినప్పటికీ పలు చోట్ల వివక్షకు గురవుతున్న సంఘటనలు వెలుగు చూస్తున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. మహిళల హక్కులపై పూర్తి అవగాహన పెంచుకోవాలని సూచించారు. మహిళల సంక్షేమం కోసం నెలకొల్పిన సంఘాల ద్వారా చట్టాలపై విస్తృత అవగాహన కల్పించాలన్నారు. బాలికల పట్ల వివక్ష చూపకూడదని, వారికి నచ్చిన రంగాల్లో ముందుకు సాగేలా ప్రోత్సహించాలని తెలిపారు. సఖి సెంటర్ల సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పకడ్బందీగా అమలు

రాజ్యాంగంలోని చట్టాలను అనుసరిస్తూ మహిళలు, బాలల సంరక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక చర్యలు చేపడుతున్నాయని కలెక్టర్ హరీశ్ అన్నారు. వీటిని క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా కమిషన్ సభ్యులు షాహీన్, రేవతి, సూదం లక్ష్మి, పద్మ, ఈశ్వరీబాయి, ఉమాదేవి, డీసీపీ సాయిశ్రీ, అడ్వకేట్ మంజూష, అదనపు కలెక్టర్ ప్రతీక్‌జైన్, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, జిల్లా సంక్షేమ శాఖ అధికారి మోతి, ఆర్డీఓలు, సీడీపీఓలు, ఉపాధ్యాయులు, కార్యదర్శులు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

పోలీసుల సేవలు భేష్



చేవెళ్ల నూతన పోలీస్‌స్టేషన్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న హోం మంత్రి మహమూద్ అలీ, డీజీపీ

- అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలుస్తున్న తెలంగాణ
- సీఎం కేసీఆర్ నాయకత్వంతోనే ఇది సాధ్యమైంది
- హోం శాఖ మంత్రి మహమూద్‌అలీ
- చేవెళ్ల, నందిగామలో నూతన పీఎస్ భవనాల ప్రారంభం

చేవెళ్ల: శాంతిభద్రతల పరిరక్షణలో మన పోలీసులు సేవలు అద్భుతంగా ఉన్నాయని హోంమంత్రి మహమూద్‌అలీ కితాబిచ్చారు. ప్రత్యేక రాష్ట్రంగా అవతరించిన ఎనిమిదేళ్లలో తెలంగాణ అన్ని రంగాల్లో అగ్రగామిగా ఎదిగిందని హోంమంత్రి మహమూద్‌అలీ అన్నారు. చేవెళ్లలో నిర్మించిన నూతన పోలీస్ స్టేషన్ భవనాన్ని బుధవారం డీజీపీ అంజనీ కుమార్, ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్సీలు మహేందర్‌రెడ్డి, సురభివాణీదేవి, జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య, సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర, పోలీస్ హౌసింగ్ సొసైటీ చైర్మన్ కె.దామోదర్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం ఇన్‌స్పెక్టర్ చాంబర్‌లో కూర్చుని ఫైల్‌పై సంతకం చేశారు. ఈ సందర్భంగా హోంమంత్రి మాట్లాడుతూ.. గతంలో పోలీసులు అంటే భయం ఉండేదని, ప్రస్తుతం అమలు చేస్తున్న ఫ్రెండ్లీ పోలిసింగ్‌తో పోలీసు వ్యవస్థపై మర్యాద, గౌరవం ఏర్పడిందని తెలిపారు. మహిళల భద్రతే లక్ష్యంగా షీటీంలు ఏర్పాటు చేసి, క్రైమ్ రేట్‌ను తగ్గించారని వెల్లడించారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో నిఘా పెరిగిందన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంతోనే ఇవన్నీ సాధ్యమయ్యాయని తెలిపారు.

రోల్ మోడల్‌గా సైబరాబాద్

డీజీపీ అంజనీకుమార్ మాట్లాడుతూ.. తెలంగాణ వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ పోలీస్ శాఖకు ప్రత్యేక రోడ్ మ్యాప్ ఇచ్చారన్నారు. పోలీస్ స్టేషన్ మెయింటెన్స్, అలవెన్స్‌ల కోసం ప్రత్యేకంగా డబ్బులు ఇచ్చిన ఘనత ఆయనకే దక్కిందని తెలిపారు. డయల్ 100 పెట్రోలింగ్ వాహనాల ద్వారా ఎక్కడికైనా 15 నిమిషాల్లో చేరుకునేలా చేయడం తెలంగాణ ప్రభుత్వానికే సాధ్యమైందన్నారు. సైబరాబాద్ కమిషనరేట్ పోలీస్ శాఖకు రోల్‌మోడల్‌గా నిలుస్తోందని స్టీఫెన్ రవీంద్రను అభినందించారు. చేవెళ్ల ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్‌ది కమిట్‌మెంట్‌తో పనిచేస్తున్న ప్రభుత్వమని కొనియాడారు. స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడుతూ.. రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ పనితీరు చాలా మెరుగుపడిందని తెలిపారు. చేవెళ్ల, శంకర్‌పల్లి, షాబాద్, మొయినాబాద్ పీఎస్‌లలో సిబ్బందికి క్వార్టర్స్ నిర్మించాలని, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ భవనం ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీఎమ్మెస్ చైర్మన్ పి.కృష్ణారెడ్డి, ఎంపీపీ విజయలక్ష్మి, జెడ్పీటీసీ మాలతి, వైస్ ఎంపీపీ శివప్రసాద్, మార్కెట్ కమిటీ చైర్మన్ మిట్ట వెంకటరంగారెడ్డి, డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి, ఏసీపీ ప్రభాకర్, సీఐలు వెంకటేశ్వర్లు, లక్ష్మీరెడ్డి, గురువయ్యగౌడ్, ప్రసన్నకుమార్, ఎస్ఐ హాయ్యమ్, ప్రదీప్‌కుమార్, ప్రజాప్రతినిధులు, అన్ని పార్టీల నాయకులు పాల్గొన్నారు.

రిజర్వేషన్లు కేసీఆర్ ఘనతే

నందిగామ: తెలంగాణ పోలీసు వ్యవస్థ దేశంలోనే నంబర్‌వన్‌గా నిలుస్తోందని హోం మంత్రి మహమూద్‌అలీ అన్నారు. నాట్కో ట్రస్టు ఆర్థిక సాయంతో నందిగామలో నిర్మించిన కొత్త పోలీస్ స్టేషన్ భవనాన్ని స్థానిక ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. తెలంగాణలో నెలకొన్న శాంతియుత పరిస్థితుల కారణంగా రాష్ట్రానికి పెద్దఎత్తున పెట్టుబడులు వస్తున్నాయని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 330 షీటీంలు పనిచేస్తున్నాయని స్పష్టంచేశారు. పోలీసు నియామకాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని తెలిపారు. ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే అంజయ్య మాట్లాడుతూ.. నాట్కో ట్రస్టు సేవలు అభినందనీయమన్నారు. డీజీపీ అంజనీ కుమార్ మాట్లాడుతూ.. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని పోలీసులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ గణేశ్, డీసీపీ నారాయణరెడ్డి, ఏసీపీ కుషాల్కర్, స్థానిక ఇన్‌స్పెక్టర్ రామయ్య, నాట్కో డైరెక్టర్ రాజీవ్ నన్నపనేని, పీఎస్ఆర్‌కే ప్రసాద్, హెచ్ఆర్ మేనేజర్ సత్యనారాయణ మేనేజర్ రాంబాబు పాల్గొన్నారు.

చెరువుల్లో పూడికతీతకు నిధులు

- పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి అరవింద్‌కుమార్
- మీర్‌పేటలో చెరువుల పరిశీలన
- నాలా పనులు పూర్తి చేయండి: మంత్రి సబిత



చందన చెరువు అభివృద్ధి గురించి అరవింద్ కుమార్‌కు వివరిస్తున్న మంత్రి సబితారెడ్డి

మీర్‌పేట: కార్పొరేషన్ పరిధిలోని మూడు చెరువుల్లో పూడికతీత కోసం హెచ్ఎండీఏ నుంచి నిధులు మంజూరు చేస్తామని పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి అరవింద్‌కుమార్ తెలిపారు. బుధవారం మీర్‌పేటలోని చందన, మంత్రాల, పెద్ద చెరువుల వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను మంత్రి సబితారెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అరవింద్‌కుమార్ మాట్లాడుతూ.. చందన చెరువు సుందరీకరణపై సంతృప్తి వ్యక్తం చేశారు. పెద్ద చెరువు వద్ద నిర్మిస్తున్న క్రీడా ప్రాంగణానికి ప్రత్యేకంగా లైటింగ్ ఏర్పాటు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మీర్‌పేటలో ఇంటి పన్నుల భారాన్ని తగ్గించేందుకు సీడీఎంఏకు ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. మూడు రోజుల్లో ప్రత్యేక జీవోను తెస్తామని, గ్రామ పంచాయతీల తరహాలో పన్నులు ఉంటాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మేయర్ ఎం.దుర్గా దీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ టీ విక్రంరెడ్డి, కమిషనర్ సీహెచ్ నాగేశ్వర్, డీఈ గోపీనాథ్ పాల్గొన్నారు.

నాలా పనులు చేయండి

వర్షాకాలంలోపు ఎస్ఎన్‌డీపీ నాలా పనులు పూర్తి చేయాలని అధికారులను మంత్రి సబిత ఆదేశించారు. క్యాంపు కార్యాలయంలో ఎస్ఎన్‌డీపీ పనులపై మంత్రి సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఎస్ఎన్‌డీపీ ఎస్ఈ భాస్కర్‌రెడ్డి, ఈఈ కృష్ణ, ఏఈ వశిష్ఠ పాల్గొన్నారు.

చెక్కులు అందజేత

మీర్‌పేట శివసాయినగర్ కమ్యూనిటీ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో పది డ్వాక్రా మహిళా పొదుపు సంఘాలకు మంజూరైన కోటి రూపాయల చెక్కులను మంత్రి సబితారెడ్డి అందజేశారు.

సంక్షేమ సీఎం కేసీఆర్



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

- ఆడపడుచుల వివాహాలకు అండగా నిలుస్తున్న సర్కార్
- మహబూబ్‌నగర్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి
- షాద్‌నగర్‌లో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

షాద్‌నగర్: అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌దేనని మహబూబ్‌నగర్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని కింగ్ ప్యాలెస్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో బుధవారం ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌తో కలిసి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. గతంలో పేదింటి ఆడ పిల్లల పెళ్లి చేసేందుకు తల్లిదండ్రులు అనేక ఇబ్బందులు పడేవారన్నారు. ఈ బాధలు గుర్తించిన సీఎం కేసీఆర్ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను ప్రవేశపెట్టారని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కులమతాలు, పార్టీలకు అతీతంగా ఆడపిల్లల వివాహానికి కేసీఆర్ అండగా నిలుస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం అందించే లక్ష రూపాయలకు పైగా సాయం పేద కుటుంబాలకు పెద్ద ఆసరాగా నిలుస్తోందని సంతోషం వ్యక్తంచేశారు. కేసీఆర్ ఏ పథకం ప్రవేశ పెట్టినా పేదల ముఖాల్లో చిరునవ్వు చిందించేలా ఉంటోందని తెలిపారు. తెలంగాణలోని సంక్షేమ పథకాలు దేశంలో ఎక్కడా లేవని కొనియాడారు. కొట్లాడి సాధించుకున్న రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా మార్చేందుకు సీఎం ఎంతగానో కష్టపడుతున్నారన్నారు. ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మాట్లాడుతూ.. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు నిరుపేదలకు వరంలాంటివన్నారు. అన్నివర్గాల ప్రజలకు కేసీఆర్ సమన్యాయం చేస్తున్నారని తెలిపారు. మహిళలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్న ఏకైక ప్రభుత్వం బీఆర్ఎస్‌దేనని స్పష్టంచేశారు. అన్నివర్గాలకు చేయూతనిస్తున్న సీఎం కేసీఆర్‌కు మద్దతు ప్రకటించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కో ఆపరేటివ్ చైర్మన్ రాజావరప్రసాద్, ఆర్డీఓ రాజేశ్వరీ, తహసీల్దార్ గోపాల్, కమిషనర్ వెంకన్న, ఎంపీపీ ఖాజా ఇద్రీస్ అహ్మద్, వెంకట్‌రాంరెడ్డి, ఎంఎస్ నటరాజన్, వంకాయల నారాయణరెడ్డి, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

కాలేయాన్ని కాపాడుకుంటే సంపూర్ణ ఆరోగ్యం



సైక్లథాన్‌ను ప్రారంభిస్తున్న రియాజ్ ఖాన్

లక్డీకాపూల్: కాలేయం బాగుంటేనే మనిషి సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నట్లు అని గ్లెనిగల్ గ్లోబల్ హాస్పిటల్ లివర్ ట్రాన్స్‌ప్లాంట్ స్పెషలిస్ట్ డాక్టర్ చందన్ కుమార్ స్పష్టం చేశారు. బుధవారం లివర్ డే సందర్భంగా వాకథాన్‌తో పాటు సైక్లథాన్ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ అవార్డి, ఆడియో ఇంజినీర్ డాక్టర్ సజీదాఖాన్, ఆస్పత్రి సీఈఓ రియాజ్‌ఖాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చందన్‌కుమార్ మాట్లాడుతూ.. మద్యపానానికి దూరంగా ఉండి జీవనశైలిని మార్చుకుంటే లివర్‌ను కాపాడుకోవచ్చన్నారు. ప్రతిరోజూ 30 నిమిషాల పాటు వ్యాయామం చేయడంతో పాటు ఆహారపు అలవాట్లను మార్చుకోవాలని హాస్పిటల్ సీఈఓ రియాజ్ ఖాన్ సూచించారు.

రూ.12 కోట్లతో 5 చెరువుల డ్రైనేజీ మళ్లింపు

- పరిపాలన అనుమతులకు స్టాండింగ్ కమిటీ ఆమోదం

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ పరిధిలోని వివిధ చెరువుల ప్రక్షాళన కార్యక్రమాల్లో భాగంగా తాజాగా అయిదు చెరువుల డ్రైనేజీ మళ్లింపు పనులు చేసేందుకు జీహెచ్ఎంసీ సిద్ధమైంది. అందుకు అవసరమయ్యే దాదాపు రూ.12 కోట్ల పరిపాలన అనుమతులకు బుధవారం జరిగిన స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది. డ్రైనేజీ మళ్లింపు చేయనున్న ఈ చెరువుల్లో గాజులరామారం మండలం లోని చింతల్‌చెరువు, మద్దెలకుంట చెరువు, బండచెరువు, కుత్బుల్లాపూర్ మండలంలోని లాల్‌సాబ్‌గూడ రామన్న చెరువు, శేరిలింగంపల్లి మండలం గచ్చిబౌలిలోని పీకాక్‌లేక్‌లున్నాయి. వీటితో పాటు మరో ఆరు అంశాలకు స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది. ఆమోదం పొందిన వాటిల్లో ఖైరతాబాద్ జోన్‌లో రూ.41 కోట్లతో నిర్మించ తలపెట్టిన 14 థీమ్‌పార్కుల్లో మూడింటికి ఎంపిక చేసిన ప్రాంతాలు అనుకూలంగా లేనందున వాటిని ఇతర స్థలాల్లో ఏర్పాటు చేయడం,ఫలక్‌నుమా జూనియర్ కళాశాల ప్రాంగణంలో రూ. 5.95కోట్లతో పెవిలియన్, ఇండోర్‌స్పోర్ట్స్ భవన నిర్మాణం,తదితరమైనవి ఉన్నాయి.సమావేశానికి మేయర్ విజయలక్ష్మి అధ్యక్షత వహించారు. కమిషనర్ లోకేశ్‌కుమార్, అడిషనల్, జోనల్ కమిషనర్లు, వివిధ విభాగాల ఉన్నతాధికారులు, స్టాండింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గార్డెన్ ఫెస్టివల్‌లో బల్దియాకు 19 అవార్డులు



సాక్షి, సిటీబ్యూరో: నగరంలో ఇటీవల నిర్వహించిన 7వ గార్డెన్ ఫెస్టివల్, మొదటి అర్బన్ ఫార్మింగ్ ఫెస్టివల్ -2023లో జీహెచ్ఎంసీకి 19 అవార్డులు లభించాయని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తెలిపారు. ఎల్బీనగర్ జోన్‌కు 14 అవార్డులు, కూకట్‌పల్లి జోన్‌కు 3 అవార్డులు, ఖైరతాబాద్‌కు 2 అవార్డులు లభించాయన్నారు. కార్యక్రమంలో యూబీడీ అడిషనల్ కమిషనర్ కృష్ణ, ఖైరతాబాద్ జోన్ డైరెక్టర్ శ్రీనివాసరావు, ఎల్బీనగర్ జోన్ డిప్యూటీ డైరెక్టర్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఓయూ ఫౌండేషన్ డేకు రాకేష్‌శర్మ

ఉస్మానియా యూనివర్సిటీ: ఈ నెల 26న జరిగే ఓయూ ఫౌండేషన్ డే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాకేష్ శర్మ హాజరు కానున్నారు. 1984 ఏప్రిల్ 3న చంద్రగ్రహణంపై తొలిసారి అడుగిడిన రాకేష్ శర్మ ఓయూకి రావడం ఇదే ప్రథమం. 26న జరిగే ఫౌండేషన్ సందర్భంగా ఈ నెల 24న మార్నింగ్ వాక్, 25న ఓపెన్ డే కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

క్లుప్తంగా

పనులు త్వరితగతిన పూర్తిచేయండి

చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎంపీ రంజిత్‌రెడ్డి

చేవెళ్ల: మినీ స్టేడియం అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని చేవెళ్ల ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో తన సొంత నిధులతో చేపడుతున్న మినీ స్టేడియం అభివృద్ధి పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కాంట్రాక్టర్‌కు పలు సూచనలిచ్చారు. వాకింగ్, రన్నింగ్ ట్రాక్, వాలీబాల్, షటిల్, బాస్కెట్ బాల్ కోర్టులు ఉండేలా స్టేడియం అభివృద్ధి పనులు చేపడ్తున్నట్లు ఎంపీ వివరించారు. ఎంపీ వెంట శంకర్‌పల్లి ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి పలువురు పార్టీ నాయకులున్నారు.

కూరగాయల సాగుతో లాభాలు

ఉద్యాన శాఖ జిల్లా అధికారి కనకలక్ష్మి



తుర్కయంజాల్: కూరగాయల సాగుతో రైతులు లాభాలు పొందవచ్చునని ఉద్యాన శాఖ జిల్లా అధికారి కనకలక్ష్మి, సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ గొల్లపెల్లి రత్నాకర్ తెలిపారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని మన్నెగూడలో రైతుల పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కూరగాయల సాగు లో రైతులు చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను వివరించారు. టిక్స్‌మో డ్రిప్ కంపెనీ ప్రతినిధి వెంకటేశ్, రైతులు మోహన్ రాజు, వెంకట్‌రెడ్డి, పర్వత్ రెడ్డి, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పశుబీమాకు మంగళం?

పరిహారం అందక ఇబ్బంది పడుతున్న పాడి రైతులు

షాబాద్: ప్రకృతి వైపరీత్యాలు, ప్రమాదాలు జరిగినప్పుడు జిల్లా వ్యాప్తంగా ఏటా వందలాది పశువులు మృతి చెందుతున్నాయి. పశుబీమా పథకం అమల్లో లేక పాడిరైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. రైతు బీమా, పంటల బీమాతో భరోసా కల్పిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పశుబీమాను మాత్రం గాలికి వదిలేశారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో కొన్నేళ్లపాటు అమలు చేసిన ఈ పథకం ప్రస్తుతం నిలిపివేశారు. పశువులు మృతిచెందితే పరిహారం అందక బాధిత రైతులు నష్టపోతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల కోసం ఎన్నో పథకాలను చేపడుతున్నామని చెబుతున్నారనే తప్ప చేసేదేమీలేదని ఆరోపిస్తున్నారు. పాడి పశువులకు బీమా ఉంటే ఆయా సంస్థల నుంచి గతంలో పశువు రకాన్ని బట్టి రూ.50 వేల వరకు పరిహారం అందేది. జిల్లా వ్యాప్తంగా లక్షల సంఖ్యలో పశువులతో పాటు గొర్రెలు, మేకలున్నాయి. వ్యయసాయంతో పాటు రైతులు పాడి పశువులు, గొర్రెలు, మేకల పెంపకంతో జీవనం సాగిస్తున్నారు. ప్రభుత్వాలు పాడి పశువులతో పాటు గొర్రెలు, మేకలను రాయితీపై అందిస్తున్నాయి.

సబ్సిడీ గొర్రెలకు ఏడాది మాత్రమే

నాలుగేళ్ల క్రితం గొర్రెల పంపిణీ పథకానికి ప్రభుత్వం మొదటిసారి బీమా సౌకర్యం కల్పించింది. కానీ ఏడాది తర్వాత బీమా ముగిసింది. రెన్యూవల్ చేయకపోవడంతో ప్రభుత్వం పంపిణీ చేసిన గొర్రెలకు ప్రస్తుతం బీమా లేకుండాపోయింది. ప్రస్తుతం రెండో విడతలో అందిస్తున్న గొర్రెలకు ఏడాది పాటు బీమాను కల్పించింది. గేదెలు, ఆవులకు సైతం ప్రభుత్వం ఎప్పటిలాగే 50 శాతం నిధులు కేటాయించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



విద్యుత్ ప్రమాదాలకే పరిహారం

పలు గ్రామాల్లో రైతులు వ్యసాయంతో పాటు పాడి పరిశ్రమ జీవనాధారంగా మలుచుకున్నారు. అన్ని గ్రామాల్లో పాల ఉత్పత్తిదారుల సంఘం ఉండటంతో పాలడెయిరీలు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఏటా వర్షాకాలంలో పిడుగుపాటుతో వందల సంఖ్యలో గొర్రెలు మేకలు, పశువులు మృతి చెందుతున్నాయి. రోడ్డు ప్రమాదాల్లోనూ పశువులు, జీవాల పెంపకందారులకు బీమా, ప్రభుత్వపరంగా పరిహారం అందక తీవ్రంగా నష్టపోతున్నారు. విద్యుత్‌శాఖ నుంచి మాత్రం ఒకింత పరిహారం అంతుతోంది.

కొంతకాలం అమలు

2009 నుంచి 2018 వరకు పశువుల బీమా అమలు చేశారు. పాడిరైతులు కొంత బీమా చెల్లించేది. ప్రస్తుతం ప్రభుత్వం బీమాను నిలిపివేసింది. ఇప్పటికైనా పశువుల బీమాను అమలు చేయాలని రైతులు కోరుతున్నారు.

బీమా సౌకర్యం కల్పించాలి



పాడి పశువులతో పాటు గొర్రెలు, మేకలకు బీమా సౌకర్యం కల్పిస్తే మేలు జరుగుతుంది. పశువులు మృతి చెందితే రైతులకు నష్టపరిహారం అందుతుంది. ఇటీవల కుక్కల దాడిలో 30 గొర్రెలు మృతి చెందాయి. బీమా అమలు చేసి ఉంటే వారికి పరిహారం అందేది.

–నారాయణ, కుర్మసంఘం అధ్యక్షుడు, కుమ్మరిగూడ

రెన్యూవల్ చేయాలి



ప్రభుత్వం మొదటిసారి రాయితీపై అందించిన గొర్రెలపై ఏడాది బీమా కల్పించింది. గడువు ముగిసి రెండేళ్లయినా రెన్యూవల్ చేయడం లేదు. దీంతో గొర్రెలు మృతిచెందితే ఆర్థికంగా నష్టపోతున్నాం. గొర్రెల బీమా పథకం అమలు చేసి కాపరులను ఆదుకోవాలి.

– పర్వతాలు, రైతు, అంతిరెడ్డిగూడ

ప్రభుత్వం నిలిపివేసింది



బీమా పథకాన్ని ప్రభుత్వం నిలిపివేయడంతోనే పాడి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. నాలుగేళ్లుగా ఈ పథకాన్ని నిలిపివేశారు. పశుబీమా అమలు చేస్తే ప్రమాదాల్లో పశువులు చనిపోయినా రైతులకు ఆర్థికసాయం అందుతుంది.

– డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, పశువైద్యాధికారి, రేగడిదోస్వాద

ప్రాణం తీసిన అతివేగం

- ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీ..
- ఇద్దరు దుర్మరణం, మరొకరికి గాయాలు



ఘటనా స్థలిలో నిర్మల, కుక్లి కాకటి మృతదేహాలు

మహేశ్వరం: అతివేగంతో ఇద్దరి ప్రాణాలు పోగా.. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన మండల పరిధిలోని నాగుల్‌దోని తండా సమీపంలో బుధవారం చోటు చేసుకుంది. మహేశ్వరం సీఐ మధుసూదన్ తెలిపిన ప్రకారం.. నాగుల్‌దోని తండాకు చెందిన అంగోత్ సంజునాయక్, భార్య నిర్మల(23) బైక్‌పై మహేశ్వరం వైపు వెళ్తున్నారు. అస్సాం రాష్ట్రం బలిగాన్ జిల్లా నాగోన్ గ్రామానికి చెందిన కుక్లి కకాటి(40) ద్విచక్రవాహనంపై మహేశ్వరం నుంచి నాగుల్‌దోని తండావైపు ప్రయాణిస్తున్నాడు. తండా సమీపంలోని హనుమాన్ ఆలయం వద్దకు రాగానే అతివేగంగా ప్రయాణిస్తున్న రెండు బైక్‌లు ఎదురెదురుగా బలంగా ఢీకొన్నాయి. దీంతో అంగోత్ నిర్మల బైక్‌పై నుంచి ఎగిరి రోడ్డుపై పడడంతో ఆమె తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే దుర్మరణం చెందింది. మరో బైక్ నడుపుతున్న కుక్లి కాకటి తీవ్రగాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆయన ఎన్టీతండా సమీపంలో ఓ వెంచర్‌లో సెక్యూరిటీగార్డుగా పని చేస్తూ పులిమామిడి గ్రామంలో నివాసం ఉంటున్నాడు. మరో క్షతగాత్రుడు సంజు నాయక్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ప్రమాద స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

కాంగ్రెస్ బలోపేతానికి శ్రమించాలి



రేవంత్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరుతున్న జంగయ్య తదితరులు

- పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి
- హస్తం గూటికి బీఆర్‌ఎస్ నేతలు

శంకర్‌పల్లి: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి అన్నారు. బుధవారం నగరంలోని ఆయన నివాసంలో టంగటూరు గ్రామానికి చెందిన శంకర్‌పల్లి పీఏసీఎస్ డైరెక్టర్, బీఆర్‌ఎస్ నాయకుడు ఎ.జంగయ్య తన అనుచరులు వంద మందితో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. రేవంత్‌రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. సీఎం కేసీఆర్ పాలనలో ప్రజలు విసిగిపోయారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.ఉదయమోహన్ రెడ్డి, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి సున్నపు వసంతం, పార్టీ మండల అధ్యక్షుడు జనార్ధన్‌రెడ్డి, టంగటూరు ఎంపీటీసీ మాజీ సభ్యుడు యాదిరెడ్డి, వార్డు సభ్యుడు రంగారెడ్డి, మాజీ ఉప సర్పంచ్ రమేశ్, నాయకులు పాండుంగారెడ్డి, కృష్ణారెడ్డి, రాజిరెడ్డి, మాధవ్‌రెడ్డి, కృష్ణమాణిక్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



షాద్‌నగర్‌రూరల్: గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని చింతగూడ శివారులో బుధవారం వెలుగు చూసింది. పట్టణ సీఐ నవీన్‌కుమార్ కథనం ప్రకారం.. గుర్తు తెలియని ఓ వ్యక్తి(40) మతిస్థిమితం సక్రమంగా లేకపోవడంతో మండల పరిధిలోని బూర్గుల, చింతగూడ గ్రామాల్లో చిత్తు కాగితాలను సేకరిస్తూ హిందీలో మాట్లాడుతూ సమీప హోటల్‌లలో ఆహారం అడుక్కొని తింటూ జీవనం వెల్లదీస్తున్నాడు. ఈ నేపథ్యంలో చింతగూడ శివారులోని పారిశ్రామిక వాడలోని పార్కులో విగతజీవిగా పడిఉన్నాడు. పార్కు పనిచేసే మహిళలకు దుర్వాసన రావడంతో సర్పంచ్ రామయ్యకు సమాచారం ఇచ్చారు. దీంతో సర్పంచ్ పోలీసులకు విషయం తెలపడంతో వారు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మూడురోజుల క్రితం మృతిచెందినట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతుడు ఇతర రాష్ట్రాలకు చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి ఆచూకీ లభించినా, వివరాలు తెలిసినా వెంటనే 9440795741, 9441285247 ఫోన్ నెంబర్లకు సమాచారం అందించాలని కోరారు. సర్పంచ్ రామయ్య ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ నవీన్‌కుమార్ తెలిపారు.

వీధి కుక్కల వీరంగం

నలుగురు వ్యక్తులు, పశువులపై దాడి



గాయపడిన మహిళ

కొందుర్గు: గ్రామాల్లో వీధి కుక్కలు వీరంగం సృష్టిస్తున్నాయి. నెల రోజుల క్రితం ముట్పూర్ గ్రామంలో పదిమంది వ్యక్తులు, పాడిపశువులు, లేగదూడలు, మేకల పై వీధి కుక్కలు దాడిచేసిన ఘటన మరువక ముందే బుధవారం చెర్కుపల్లి గ్రామంలో తెల్లవారుజామున ఎనిమిది మంది వ్యక్తులతో పాటు ఇరవై పశువులపై దాడిచేశాయి.ఆరుబయట నిద్రిస్తున్న జాకారం పెంటమ్మపై దాడి చేసి చేతివేళ్లను కొరికేశాయి, వడ్డె వేణు, వడ్డెపల్లె చంద్రయ్య, పరిగినుంచి చుట్టపుచూపుగా వచ్చిన ఓ మహిళ కుక్కకాటుకు గురయ్యారు. ఆరు ఆవులు, రెండు గేదెలు, ఓ మేక, ఓ లేగదూడ వీధి కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడ్డాయి. కాగా కుక్కల దాడిలో గాయపడిన వారిని షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. పశువులకు కొందుర్గు పశువైద్యులు పరీక్షలు నిర్వహించి వైద్య సేవలు అందించారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

తలకొండపల్లి: అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ వెంకటేశ్ తెలిపిన ప్రకారం..కేశంపేట మండలం నిర్దవెళ్లి వాగు నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు పోలీసులు చంద్రధనలో ట్రాక్టర్లను ఆపి పత్రాలు పరిశీలించారు. ఎటువంటి అనుమతులు లేకపోవడంతో ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించి సీజ్ చేశారు.డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పెద్దేముల్‌లో..

పెద్దేముల్: ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ అన్వేష్‌రెడ్డి తెలిపిన వివరాలు.. బుధవారం రాత్రి మండలంలోని రుక్మాపూర్ మీదుగా మంబాపూర్‌కు వెళుతున్న ఇసుక ట్రాక్టర్‌ను బ్లూ కోట్స్ పోలీసులు స్వాధీనం చేసుకొని స్థానిక పోలీసులకు అప్పగించారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని ఎస్‌ఐ అన్వేష్‌రెడ్డి హెచ్చరించారు.

వ్యక్తి అదృశ్యం



దేవ (ఫైల్)

పహాడీషరీఫ్: పహాడీషరీష్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. తుక్కుగూడకు చెందిన కేతావత్ శోభ, దేవ భార్యాభర్తలు. ఈ నెల 18న మధ్యాహ్నం వారి కుమారుడు సెల్‌ఫోన్‌లో గేమ్ ఆడుతుండగా దేవ ఆగ్రహంతో చేయి చేసుకున్నాడు. దీంతో దంపతులిద్దరూ గొడవపడ్డారు. సాయంత్రం 4గంటల సమయంలో బయటకు వెళ్లిన ఆయన తిరిగి ఇంటికి రాలేదు. భార్య ఎక్కడ వెతికినా భర్త ఆచూకీ లభించకపోవడంతో పోలీసులను ఆశ్రయించింది. ఆచూకీ తెలిసిన వారు పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్‌లో గానీ 94906 17241 నెంబర్‌లో గాని సమాచారం అందించాలని పోలీసులు తెలిపారు.

ఉద్యమ నేతకు తగిన గుర్తింపు

- ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



రాష్ట్ర కోఆపరేటివ్ చైర్మన్ రాజావరప్రసాద్‌ను సన్మానిస్తున్న నాయకులు

షాద్‌నగర్: ఉద్యమకారుడికి ప్రభుత్వం తగిన గుర్తింపు ఇచ్చిందని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. రాష్ట్ర కోఆపరేటివ్ చైర్మన్‌గా ఎన్నికైన రాజావరప్రసాద్ బుధవారం ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆయన్ను ఘనంగా సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమ ఆవిర్భావం నుంచి పార్టీకి రాజావరప్రసాద్ ఎన్నో సేవలు చేశారని గుర్తు చేశారు. ఆయన సేవలను గుర్తించిన ప్రభుత్వం సముచిత స్థానం కల్పించిందన్నారు. అనంతరం రాజావరప్రసాద్ మాట్లాడుతూ.. పార్టీ అభివృద్ధికి, కార్యకర్తల శ్రేయస్సుకోసం తనవంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నారాయణరెడ్డి, ఎంఎస్ నటరాజన్, ఖాజా ఇద్రీస్ అహ్మద్, రవియాదవ్, లక్ష్మణ్‌నాయక్, నారాయణ, జీటీ శ్రీనివాస్, శ్రీనివాస్‌గౌడ్, రవీందర్‌రెడ్డి, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలను ఎండగట్టండి

- సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు నర్సింహ



మాట్లాడుతున్న నర్సింహ

ఇబ్రహీంపట్నం: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కావలి నర్సింహ పిలుపునిచ్చారు. యాచారం, మంచాల, ఇబ్రహీంపట్నం మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశం బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ పాలనలో పెట్రోల్, వంట గ్యాస్ సిలిండర్, నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయని ఆరోపించారు. బీజేపీ హటావో.. దేశ్‌కి బచావో నినాదంతో ప్రతీ గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఎన్.శ్రీశైలం, నీలమ్మ, సి.లక్ష్మయ్య, పి.యాదయ్య, రాజు, విజయ్‌కుమార్, కృష్ణ, శ్రీహరి పాల్గొన్నారు.

చినజీయర్‌స్వామికి ఘన స్వాగతం



దివ్య సాకేతాలయం ఆవరణలో మాతృమూర్తి విగ్రహానికి పూజలు నిర్వహిస్తున్న చినజీయర్‌స్వామి

శంషాబాద్ రూరల్: పద్మభూషణ్ అవార్డు గ్రహీత శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ చిన జీయర్ స్వామికి భక్తులు ఘనస్వాగతం పలికారు. ఢిల్లీలో అవార్డు తీసుకున్న తర్వాత ఆయన శంషాబాద్ మండలంలోని ముచ్చింతల్ శివారులో ఉన్న ఆశ్రమానికి మొదటిసారి వచ్చారు. ఈ సందర్భంగా మంగళవారం రాత్రి శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఆశ్రమం వరకు ర్యాలీ నిర్వహించారు. పూలమాలతో ఆయనను వాహనంపై ఆశ్రమం వరకు ఊరేగించారు. ఆశ్రమంలో సమతామూర్తిని దర్శించుకున్న చినజీయర్‌స్వామి అక్కడ ఉన్న ఆయన మాతృమూర్తి విగ్రహానికి మాలసమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో మైహోం గ్రూపు అధినేత జూపల్లి రామేశ్వర్‌రావు, శ్రీత్రిదండి అహోబిల జీయర్‌స్వామి, శ్రీ వేదనాథ జీయర్‌స్వామి పాల్గొన్నారు.

వ్యవసాయ రంగంలో పరిశోధనలు అత్యవసరం

ఏజీవర్సిటీ: వ్యవసాయ రంగంలో పరిశోధన ,విస్తరణ విభాగాలు చాల ముఖ్యమైనవని.. వాతావరణ మార్పులు, నూతన టెక్నాలజీ విషయంలో రైతుల్లో విస్తృత అవగాహన కల్పించడానికి కృషి విజ్ఞాన కేంద్రాలు పని చేయాలని వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ సుధారాణి అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం,అగ్రికల్చర్ టెక్నాలజీ అప్లికేషన్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ హైదరాబాద్ సంయుక్త నిర్వహణలో రాజేంద్రనగర్‌లోని విస్తరణ విద్యాసంస్థలో రెండు రోజుల వర్క్‌షాప్ నిర్వహించారు.ఈ వర్క్‌షాప్‌లో 2023- 24 సంవత్సరానికి తెలంగాణలోని 16 కృషి విజ్ఞాన కేంద్రాలు అనుసరించాల్సిన వార్షిక కార్యాచరణ ప్రణాళికను ఆమోదించనున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా బుధవారం వారు మాట్లాడుతూ వ్యవసాయ పంటలకు సంబంధించి ఫుడ్ ప్రాసెసింగ్, మార్కెటింగ్ పద్ధతులు,రైతు ఉత్పత్తి సంఘాలు వంటి విషయాలపై రైతుల్ని చైతన్యవంతుల్ని చేయాలని కేవీకే శాస్త్రవేత్తలకు సూచించారు.పరిశోధన సంచాలకులు వెంకటరమణ మాట్లాడుతూ పురుగు మందులు,ఎరువుల అధిక వినియోగాన్ని తగ్గించడానికి రైతుల ఆదాయం పెంపొందించేందుకు అవసరమైన సలహాలు, సూచనలు అందించాలని పేర్కొన్నారు. మారుతున్న కాలంలో వ్యవసాయంలో డిజిటలీకరణ ప్రాముఖ్యాన్ని రైతుల వద్దకు తీసుకెళ్లాలని అగ్రికల్చరల్ టెక్నాలజీ ఇనిస్టిట్యూట్ మాజీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఏక్ ఎస్ మీరా చెప్పారు.బిధాన్ చంద్ర కృషి విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి డాక్టర్ ఆర్‌కే సమంత మాట్లాడుతూ కృషి విజ్ఞాన కేంద్రాలను మినీ అగ్రికల్చరల్ యూనివర్సిటీలుగా మార్చేందుకు కృషి చేయాలని, అదే విధంగా రైతులకు నూతన వ్యవసాయ పరిజ్ఞానం అందించాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం అధికారులు, కొండ లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం అధికారులు, నర్సింహారావు, వివిధ శాఖల అధికారులు ,కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.